# నిత్య కల్యాణి

గాలి ప్రభావతి

"మెహతా డిన్నర్ ఇస్తున్నాడు—ఇవాళ డాలీ పుట్టిన రోజట—ఎనిమిది గంటలకి వెళ్ళాలి. నిన్నుకూడా తీసుకు రమ్మని మెహతా ఇంట్లో అందరూ చెప్పారు. డాలీ మరీ మరీ అడిగింది. సాయంత్రం నేను వచ్చేసరికి రడీగా ఉండు."

ఆఫీసుకు బయలు దేరే తొందరలో ఉన్నాడు శేఖర్. అద్దం ముందు నుంచుని టై కట్టుకుంటు న్నాడు.

"మీరు వెళ్ళండి. . .నేనెందుకు ?"

"ఏం?" వెనక్కి తిరిగి చూశాడు శేఖర్.

శ్రీమతి తనవంక చూడడం లేదు.

పిల్లల బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వాటిని అడ్డదిడ్డంగా మడిచి విసురుగా స్టాండ్ మీద పడేస్తోంది.

"రాజేశ్వరిగారూ, నేనూ సినిమాకి వెళ్ళాలను కుంటున్నాం." ముభావంగా సమాధానమిచ్చింది శాంతి.

"రేపు వెళ్ళవచ్చు. మనమిద్దరం—"

"అలా అనుకుంటేనే కాని ఇద్దరం కలిసి వెళ్ళామా ఎప్పుడైనా? ఎక్కడికైనా?"

భర్తవంక చురుక్కున చూసి తలతిప్పుకుంది శాంతి.

"అందుకే ఇవాళ వెళదామంటున్నాను—డిన్నర్‌కి."

అద్దంలోంచే ఆమెను పరిశీలనగా చూశాడు శేఖర్.

"నేను రాను" కచ్చితంగా చెప్పింది శాంతి.

"నీ ఇష్టం."

బాగ్ తీసుకుని విసురుగా వెళ్ళిపోయాడు శేఖర్.

* * *

నాలుగు గంటలకి డాలీ ఫోను చేసింది—

"అంకుల్! డిన్నర్ విషయం జ్ఞాపకం చెయ్య మన్నారు డాడీ!"

"ఓకే. ఓకే"

"ఆంటీ వస్తున్నారు కదూ?" చిలిపిగా ప్రశ్నిం చింది డాలీ.

డాలీ అంటే నూరికే ఉడికిస్తుంది. పదహారేళ్ళు నిండినా పసిపిల్ల. అల్లరి పిల్ల. . . మెహతా కూతుర్ని అతిగారాబంగా పెంచుతున్నాడు. . . చురుకైన అమ్మాయి. తెలివైనది. తన భార్యని గురించి మెహతా ఇంట్లో అందరూ ముసంగా ఊహించుకుంటున్నారు. ఆమెను చూడాలని పట్టు దలతో ఉన్నారుకాని. . .ఆమేమని చెప్పగలడు!— ఆవిడ మొండితనం, అర్థం లేని కాంప్లెక్స్ గురించి—

"శ్రీమతి ఆరోగ్యం బాగాలేదట. సారీ అని చెప్పమంది" తన జవాబు తనకే నచ్చలేదు.

"ఎక్స్‌పెక్టింగ్?" కొంటెగా నవ్వింది డాలీ.

"నో. . .వాట్ గర్ల్!" నవ్వు ఆపుకోలేక పోయాడు శేఖర్.

కిలకిలా నవ్వి ఫోన్ పెట్టేసింది డాలీ.

* * *

ఇంటికి వచ్చేసరికి రాత్రి పది గంటలయింది. సర్వెంట్ చంద్రయ్య తన కోసం ఎదురు చూస్తూ వరండాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

హాల్లో చిన్న లైటు మాత్రం వెలుగుతోంది. పిల్లలు నిద్రపోయారు. శ్రీమతి సినిమాకి వెళ్ళిన జాడ లేదు. తనతో అబద్ధమాడింది— తప్పించుకోటానికి. హాయిగా నిద్ర పోతోంది. . .

చంద్రయ్యను పడుకోమని చెప్పి తన గదిలోకి వెళ్ళాడు శేఖర్. లైటు వేసి దుస్తులు మార్చు కున్నాడు.

టేబుల్ మీద ఉత్తరం!. . .

దస్తూరీ పోల్చుకున్నాడు. అక్కయ్య రాసింది— చాలా సంవత్సరాల తర్వాత. త్వరత్వరగా తీసి చదివాడు.

చిరంజీవి తమ్ముడికి,

ఆశీస్సులు. ఇక్కడ అందరం క్షేమం. మీరందరూ కులాసా అని తలుస్తాను. నువ్వు ఉత్తరాలు వ్రాయటం పూర్తిగా మానుకున్నావు. మమ్మల్ని మరచి పోయావా—నామీద కోపమా? బావగారు నిన్ను తలుచుకోని రోజు లేదు. రవి కూడా నిన్ను చూడాలని కలవరిస్తున్నాడు. వీలు చేసుకుని ఒకసారి నువ్వు కుటుంబంతో సహా బయలుదేరి రావలసింది.

అన్నట్టు—ఇప్పుడు కళ్యాణివాళ్ళు ఈ వూళ్ళోనే ఉంటున్నారు—పినతండ్రి గారింట్లో. పాపం! కళ్యాణి తండ్రి పోయాడు. . . .

బావగారు నిన్ను అడిగినట్లు వ్రాయమన్నారు. రవి నీకు నమస్కారాలు చెప్పుతున్నాడు.

మీ క్షేమం తెలుపుతూ ఉత్తరం వ్రాయి.

ఇట్లు,

అక్కయ్య.

ఉత్తరం మరోసారి చదివి డ్రాయర్లో పడేశాడు శేఖర్. . .సిగరెట్ వెలిగించుకుని లైటు తీసేసి మంచం మీద వాలి పోయాడు. . .

తన హృదయాంతరాళాలలో సుప్తంగా దాచుకున్న వజ్రాన్ని ఎవరో బలవంతంగా గునపాలతో బయటికి తవ్వుతున్నట్లనిపించింది. ఎవరో నిర్దాక్షిణ్యంగా గుండెల్ని పట్టి పిండుతున్నట్లనిపించింది. వెయ్యిసార్లు వినవచ్చింది. తన లోలోపల అంతాటి ఆ తీయని కంఠస్వరం. . .ఆ పిలుపు. . .ఆ ఆహ్వానం.

ఉద్వేగం కట్టలు తెంచుకుని . . . అక్కయ్య మీద పట్టరాని కోపం. విధి మీద కసి. . .తన మీద తనకే అసహ్యం. చిరాకు. తన అసమర్థత. చేతకాని తనం. . . ఆలోచనలు గిర్రున తిరుగు తున్నాయి. తల పగిలి పోతోంది. . .

ఆనాడు ఈనాడు కూడా తను నోరు మెదపలేని వాడు. అప్పుడు అక్కయ్య బావగార్ల పెద్దరికం. . . ఇప్పుడు విచక్షణ జ్ఞానంలేని తన భార్య మూర్ఖ త్వం.

"మా చేతుల్లో పెరిగి పెద్దవాడివయ్యావు బావగారికి నువ్వంటే పంచప్రాణాలు. నీ మీద ఉన్న మమకారంకొద్దీ 'శాంతి' ని నీకు చేసుకుంటావని బావగారు వాళ్ళకి మాటిచ్చారు. అయిన వాళ్ళతో వ్యవహారం. . .నా మాట మీద గౌరవం ఉంచు శేఖరం. పోనీ నా సంగతి వదిలేయ్. బావగారి ముఖం చూసి అయినా నువ్వు శాంతిని పెళ్ళి చేసుకోవాలి."

—అంటూ ప్రతిసారి ఇరుకున పెట్టి తనని పెళ్ళికి ఒప్పించింది అక్కయ్య. బావగారికి పినతండ్రి కూతురు శాంతి. కలవారి ఇంటి ఆడపడుచు. ఆనాడు వాళ్ళ చుట్టరికం తీర్చ పెద్దరికం తన జీవితాన్ని తనకిష్టం లేని మలుపులోకి తిప్పి వదిలేశాయి.

ఆ దారిలో తన ప్రయాణం ఎంత ఆహ్లాదంగా సాగుతుందో చాలా కాలం వరకూ అక్కయ్యకే తెలియదు. ఆ తర్వాత క్రమంగా ఆవిడకి పరిస్థితి బోధపడింది. చదువు సంగతి ఎలా ఉన్నా సంస్కారం కొంచెమైనా అలవరచుకోని శాంతి అహంకారం, పెడసరపు తత్వం అక్కయ్య మనసుని కూడా తీవ్రంగా గాయపరిచింది. అప్పుడు అర్థమైంది— తమ్ముడి సంసారంలో సుఖశాంతులు ఎంత మాత్రం ఉన్నాయో!

—ఇల్లాలి పేరు శాంతి. ఇంట్లో అనుక్షణం అశాంతి. అడుగడుగునా అలకలు అనుమానాలు, అపోహలు. ప్రతి చిన్న విషయానికి మొండి వాదనలు పెంచి ఇల్లు నరకంగా తయారు చేస్తోంది.

. . .అయినవాళ్ళ పిల్ల. అన్ని విధాల మన కుటుంబంలో కలిసి పోయి అనుకూలంగా ఉంటుందని అనుకున్నారు. ఆనాడు అక్కయ్య బావా. కాని ఆ ఆశలకు భిన్నంగా ఆవిడ కొరకరాని కొయ్యగా తయారయింది.

డబ్బులో పుట్టి డబ్బులో పెరిగానన్న అహం. తన మాటే చెల్లాలన్న మొండి పట్టుదల. పై పెచ్చు తన భర్త పెళ్ళికి ముందే ఇష్టం వచ్చినట్టు ఆడపిల్లలతో విచ్చలవిడిగా తిరిగేవాడని, కేవలం ఆస్తి మీద మోజుకొద్దీ తనని పెళ్ళి చేసుకున్నాడని ఇద్దరు బిడ్డల తల్లయినా ఇప్పటికీ ఆడపిల్లలతో స్నేహాలు షికార్లు మానలేదని—ఇలా ఏవేవో కథలు కల్పించుకుని లేని వాక్యాలలో అవిడ దానితో సాధించుకొంటోంది, ఆవిడే తన [illegible] పూహి చు కునేది కొన్నా—ఈ అనుమానాలన్నీ ఆమె మనస్సులో

పొరుగుని క్రమంగా పెరిగి రానురాను తన పెరిట ల్లవాతావరణం తను ఏ ఆడదానితో మాట్లాడినా అనుమానం. తన నోటి వెంట ఏ ఆడదాని పేరు వినిపించినా అపరిమిత ఈర్ష్య. తను ఏ పనిమీద ఎక్కడికి వెళ్ళి ఆలస్యంగా వచ్చినా ఆ రోజు ఇల్లు పరిప్రశ్నం చేసి తనని సూటిపోటి మాటలతో హింసిస్తుంది. ఇదీ తన జీవితం.

కల్యాణికి చేసిన అన్యాయానికి ప్రతిఫలమే తను ఇప్పుడు అనుభవిస్తున్న యాతన. మనస్సులో తిరిగి వేయని. గుండెల్లో రగిలే అగ్ని. . ఆనాడు ఆమెకి తీరని ఆశలు కల్పించి ఆమె జీవితంలో ప్రవేశించాడు తను. వెర్రివెర్రి వాగ్దానాలతో ఆమెని నమ్మించి తీరా సమయం వచ్చేసరికి తాను సంబెట్టకోలు చేతకాక విధి ముందు తలవంచి చేతులు కట్టుకుని నిలబడి పోయాడు. . . .

* * *

పక్కింట్లో గడియారం గంటలు కొట్టింది. . శ్రీమతికి మెలకువ వచ్చినట్టుంది . . . సడిరాకే బెడ్ లైటు వేసి లేచి చూసింది.

"ఎంతసేపయింది వచ్చి?"

"చాలా సేపయి ఉంటుంది."

"నిద్ర పోలేదా?"

"నిద్ర రాలేదు."

"ఏమిటాలోచిస్తున్నారు?"

"నిన్ను గురించే"

"ఏమని?" ముందు పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది శాంతి.

"సినిమాకి వెళ్ళలేదేమిటా? అని"—

పక్కకి తిరిగి భార్య ముఖంలోకి పరకాయించి చూశాడు శేఖర్.



శాంతి ముఖం తిప్పుకుంది. కిటికీలో నుంచి బయటకు చూస్తూ ఉంది—

"చలిగాలి వేస్తోంది. కిటికీ తలుపులు మూసెయ్యనా?"

"నాకు చలి వెయ్యటం లేదు."

"మా అక్కయ్యగారి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది."

"చూశాను."

రెండు నిముషాలు ఆగి శాంతి అడిగింది.

"కల్యాణి ఎవరు? కొత్త ఫ్రెండా?"

"కాదు. . .పాత ఫ్రెండే."

శేఖర్ మరో సిగరెట్ వెలిగించుకున్నాడు. గోడ మీద ఫోటోలకేసి చూస్తున్నాడు.

"మొత్తానికి ఫ్రెండేనన్నమాట?"

శాంతి కంఠంలో వెటకారం ధ్వనించింది.

"అవునని చెప్పేనుగా! ఇంకా ఎందుకలా మనస్సుని తొలుస్తావు?"

దురుసుగా అన్నాడు శేఖర్.

"ఇన్నాళ్ళూ లేని ఎందుకంత ఆవేశం?"

"ఇంకా ఎక్కడ మిగిలాయి ఆవేశాలు—నిన్ను కట్టుకున్నాక అన్ని ఆవేశాలు, అసలు అణగారి పోయాయి."

"ఏం? నాకేం తక్కువ? అనాకారినా? ఐశ్వర్యం తక్కువా?"

"బుద్ధి ఒక్కటే తక్కువ. . . ఇక విసిగించక పూరుకో."

శేఖర్ గోడవైపు తిరిగి పడుకున్నాడు.

శాంతి విసురుగా లేచి లైటు తీసేసి పిల్లలు పడుకున్న గదిలోకి వెళ్ళిపోయింది.

* * *

చదువు పూర్తి అయి ఆ పూరా ఈ పూరా తిరుగుతూ చిన్న చిన్న టెంపరరీ ఉద్యోగాలు చేస్తూ కాలక్షేపం చేసిన రోజులవి. . .అలా సంవత్సరం గడిచాక వేసవిలో మళ్ళీ అక్కయ్యగారింటికి వచ్చేడు తను. . .

ఒకరోజు మధ్యాహ్నం వేళ. . గదిలో మంచం మీద కునుకు తీస్తుంటే—

"ఏ కళాకారుడి సృష్టికైనా ఏదో గాఢమైన ప్రేరణ ఉండే ఉంటుంది సినీ! తను దర్శించిన విషయాన్ని లోకానికి చెప్పాలనే ఉబలాటం, తను ఇంకా పరిశీలించి పూర్తిగా అర్థం చేసుకోటానికి సాగించే అన్వేషణ లేదా ఆత్మానందం సామాజిక ప్రయోజనం ఇవన్నీ ఆ సృష్టికి కారణాలవుతాయి."

కలత నిద్రలో ఉన్న శేఖర్ని ఆ కంఠం భుజం తట్టి మేల్కొలిపినట్లయింది ఉలిక్కిపడి లేచాడు శేఖర్.

గదిముందు వరండాలో అక్కయ్య పక్కన కూర్చుని పెద్ద ఆరిందలాగ ఉపన్యాసమిస్తోంది ఒకానొక చిన్నారి. తను వరండాలో ప్రవేశించగానే అక్కడ ఉన్న రెండు మూడు పుస్తకాలు చప్పున చేతిలోకి తీసుకుని చకచకా మెట్లు దిగి వెళ్ళిపోతుంది.

"కాలేజీ కల్యాణి ఏమిటలా పారిపోతావు? మీ వదిన తమ్ముడు శేఖరం. . . పిన్నివే అన్నాడు—

> నిజాయితీ వేరు. వితరణ వేరు... దాతృత్వం ప్రదర్శించాలని తహతహలాడే వారిలో నిజాయితీ కనిపించదు.
>
> —జానియన్

మొయ్య గుళ్ళ పూజారిలా పూళ్ళన్నీ తిరిగి." అన్నది అక్కయ్య నవ్వుతూ.

ఒకసారి వెనక్కి తిరిగి తనవంక చూసి హడావిడిగా గేటు తీసుకుని క్షణంలో అదృశ్యమైంది ఆ మెరుపు తీగ.

"ఎవరీ కల్యాణి, ఏమిటి కథ?" అన్నట్టు ప్రశ్నార్థకంగా అక్కయ్య వంక చూశాడు తను.

"పక్క వీధిలో విశ్వనాథ గారు లేరూ—మీ బావగారి స్నేహితుడు—ఆయన అమ్మాయి కల్యాణి. చిన్నతనంలోనే తల్లి పోయిందట. ఇద్దరు ఆడపిల్లల్ని, మగ పిల్లాణ్ణి తండ్రి పెంచి పెద్ద చేశాట్ట. ఆ పల్లెటూళ్ళోనే కల్యాణి హైస్కూలు చదువు పూర్తయింది. . .కట్నాలు పోసి పెళ్ళి చేసే స్తోమత లేదు మరి. అందువల్ల అప్పుడే చదువు మాన్పించి ఇంట్లో కూర్చోపెట్టటం ఇష్టంలేక ఇక్కడ తమ్ముడిగారింట్లో ఉంచి కాలేజీలో చేర్పించాడు వాళ్ళ నాన్న. . .అక్కడ తండ్రీ, పిల్లలు వంటరిగా కాలక్షేపం చేస్తున్నారు. ఆయన అక్కడ హైస్కూల్లో టీచరు. . .రెండు మూడు సార్లు విశ్వనాథంగారింట్లో ఏవో పేరంటాలయితే వెళ్ళాను — అప్పుడే కల్యాణిని చూశాను. చాలా కలుపుగోలు పిల్ల. మనసంతా ఇట్టే ఆకట్టుకుంటుంది. . . మొన్న పెద్ద పరీక్షల ముందు మన రవి బొత్తిగా చదవకుండా అల్లరి చేస్తూ తిరుగుతూంటే నేనే కల్యాణిని రోజూ వచ్చి ఒక గంటసేపు వాణ్ణి కూర్చోబెట్టి చదివించమ్మా అని అడిగాను. . .ఆ అమ్మాయి పుణ్యమా అని ఈసారి వాడు మంచి మార్కులతో పాసయ్యాడు. ఆ అమ్మాయి మన కుటుంబంలో పిల్లలా కలిసిపోయింది. . .వాళ్ళ బాబాయి సిటీ లైబ్రరీ నుంచి ఏవో నవలలు, నాటకాలు తెస్తూ ఉంటాడు. కల్యాణి ఆ పుస్తకాలన్నీ శ్రద్ధగా చదువుతుంది. నా చేత కూడా చదివిస్తూ ఉంటుంది. నేను పనిలో ఉంటే తనే చదివి వినిపిస్తుంది. ఎప్పుడూ ఆ కథల్ని గురించి, వాటిల్లో పాత్రల్ని గురించి మాట్లాడుతుంది. అదే ఆలోచిస్తూ ఉంటుంది. చిత్రమైన తత్వం. . ."

అక్కయ్య వంట ఇంట్లోకి వెళ్ళి కాఫీ తెచ్చి ఇచ్చి తర్వాత తన పనుల్లో మునిగి పోయింది. . .

నాలుగైదు రోజుల తర్వాత ఒక ఉదయం తను కాస్త త్వరగా నిద్ర లేచాడు. టూత్‌పేస్ట్, బ్రష్ తీసుకుని టవలు భుజాన వేసుకుని పెరట్లోకి నడిచాడు. విరిసిన నవ్వులు, పరుగులు ఉరుకులు, అల్లరి వినిపించాయి. తలెత్తి చూశాడు. దూరంగా పొగడ చెట్టు కింద తన మేనల్లుడు రవి పదమూడేళ్ళ కుర్రాడూ, ఆ చిన్నారి—కల్యాణి! కల్యాణి దోసిలి నిండా పొగడ పూలున్నాయి. రవి వాటిని అందుకుంటూ వెనుక పరుగెత్తుతున్నాడు. కల్యాణి వాడికి అందకుండా పరుగు తీస్తూ వాణ్ణి పొగడ చెట్టు చుట్టూ తిప్పుతూంది. తను ఒక్క క్షణం చూసి తనూ వెళ్ళి కల్యాణికి అడ్డంగా నిలిచి ఆమె పరుగుని అటకాయించాడు. కల్యాణి నివ్వెరపోయి అలాగే నిలబడి పోయింది. తను అప్పుడు కల్యాణిని చాలా దగ్గర నుంచి రెప్ప వాల్చకుండా చూశాడు. చక్కని ముఖ వర్చస్సు. . . కళ్ళల్లో అద్భుతమైన ఆకర్షణ. . . అప్రయత్నంగా తన పెదవులు కదిలాయి—'మీ పేరు. . . అక్షరాలా. . .మీకు తగినట్టుంది'— అన్నాడు తను.

ఇంతలో రవి ఒక్క ఉదుటున కల్యాణి వెనక నుంచి వచ్చి ఆమె దోసిలి ఎగరగొట్టాడు. పువ్వులన్నీ కింద పడి పోయాయి—శేఖర్ పాదాల మీద.

రవి కేరింతలు కొట్టి పకపకా నవ్వి పారి పోయాడు. కల్యాణి తల వంచుకు పూరుకుంది.

"సారీ కల్యాణి! వెరీసారీ!. . . రవిని నేను కోప్పడుతానులెండి. . . ఈ పూలు మీకోసం—"

"కాదు. అవి దేవుడికోసం."

అంటూ ఆ అమ్మాయి ఒక్కసారి తన వంక తేరిపార చూసి చకచకా పెరటి తలుపు తీసుకుని వెళ్ళిపోయింది.

తర్వాత—కల్యాణి ఎప్పుడు వచ్చినా ఆమె అక్కయ్యతో మాట్లాడుతూంటే తను చాటు నుంచి శ్రద్ధగా వినేవాడు. ఒక్కొక్కప్పుడు తను కూడా తెరముందుకు వచ్చి వాళ్ళ సంభాషణల్లో పాల్గొనేవాడు.

ఒకరోజు సాయంత్రం కుండపోతగా వర్షం కురుస్తోంది. ఉరుములు మెరుపులు గాలివాన అట్టహాసంగా ఉంది. కల్యాణిని చూడాలని కాలేజీకి వెళ్ళి ఆమెతోపాటు తనూ అక్కడే వర్షంలో చిక్కుపడి పోయాడు. బాగా చీకటి పడింది. జన సందడి క్రమంగా తగ్గిపోయింది. . .పూరికి చాలా దూరాన ఉన్న ఆ ప్రాంతంలో ఆ సమయంలో ఎక్కువసేపు ఉండడం క్షేమం కాదు. అక్కడ ఒకే ఒక రిక్షా ఉంది. తప్పని సరై ఆ రోజు తనూ, కల్యాణి ఒక్క రిక్షాలో రావలసి వచ్చింది. ఇద్దరూ పూర్తిగా వర్షంలో తడిసి ముద్దయి పోయారు. . .రోడ్డు చివరి మలుపు దగ్గర ఇద్దరూ రిక్షా దిగేసరికి ఎదురుగా కల్యాణి బాబాయి విశ్వనాథంగారు ప్రత్యక్షమైనాడు. ఆయన కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. అంతే. ఆ తర్వాత కల్యాణి తన కంట పడడమే అపురూపమైపోయింది. ఇంట్లో ఆమెకి [illegible] శాపనార్థాలు, కట్టుదిట్టాలు మితిమీరిపోయాయి.

అదే సమయంలో తనకి మళ్ళీ ఉద్యోగం దొరకటంతో పూరు వదిలి వెళ్ళవలసి వచ్చింది . .

ఇంతలో కొంప మునిగి పోతుందేమో అన్నట్టు అక్కయ్య, బావగారు తన ప్రమేయం లేకుండానే శాంతితో తన పెళ్ళి ఖాయం చేసేశారు. తను ససేమిరా ఒప్పుకోనన్నాడు కల్యాణిని తప్ప మరొకరిని చేసుకోనని ఎదురు తిరిగాడు. ఇంట్లో నానా హంగామా జరిగింది. తను ఇల్లు విడిచి వెళ్ళి పోతానన్నాడు. అక్కయ్య కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. ప్రతిమాలింది. అందరి వాళ్ళందరిచేతా చెప్పించింది. . . ఆయన మాట కాదన్నావని బావగారు

